సాక్షి
జనగామ

మంగళవారం | 6 | ఫిబ్రవరి | 2024



భక్తులకు మెరుగైన సౌకర్యాలు

మేడారం జాతరకు వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నామని మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క తెలిపారు.

- 8లో▸



భవ్య కటుంబీకుల రాస్తారోకో

భవ్య మృతికి కారణమైన వారిని శిక్షించాలని డిమాండ్ చేస్తూ సోమవారం బుధరావుపేట జాతీయ రహదారిపై రాస్తారోకో చేపట్టారు.

- 8లో▸

గరిష్టం/కనిష్టం
36^0 / 20^0

వాతావరణం

జిల్లాలో ఉదయం చల్లని వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం సమయంలో ఉష్ణోగ్రతలు కాస్త పెరుగుతాయి. రాత్రి పూట చలి తీవ్రత కొంత మేర తక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ప్రవేశ గడువు పొడిగింపు

జనగామ రూరల్: జిల్లాలోని మైనార్టీ గురుకుల పాఠశాల, కళాశాలలో ప్రవేశానికి గడువు ఈనెల 15 వరకు పొడిగించినట్లు జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి ఇస్మాయిల్ ఒక ప్రకటనలో తెలిపారు. 2024–25 విద్యాసంవత్సరానికి 5 నుంచి 10 తరగతులు, ఇంటర్ ప్రవేశాల మరిన్ని వివరాలకు 93466 77568, 94419 03130 నంబర్లలో సంప్రదించాలన్నారు.

22 మంది గైర్హాజర్

జనగామ రూరల్: జిల్లాలో జరుగుతున్న ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలకు సోమవారం 22 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని పరీక్షల కన్వీనర్ బైరీ శ్రీనివాస్ తెలిపారు. మొత్తం 34 సెంటర్లలో పరీక్షలు నిర్వహిస్తుండగా.. ఉదయం జనరల్, ఒకేషన్ పరీక్షలకు 277 మందికి 259, మధ్యాహ్నం పరీక్షకు 224 మందికి 217 మంది హాజరైనట్లు పేర్కొన్నారు.

‘ఉపాధి’కి నిధులు పెంచాలి



జనగామ రూరల్: కేంద్రం ప్రవేశ పెట్టిన మధ్యంతర బడ్జెట్‌లో ఉపాధి హామీ పథకానికి నిధులు పెంచాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మంగళంపల్లి జనార్దన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో సంఘం ఆధ్వర్యాన అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. కేంద్రం ఉపాధి పథకాన్ని నిర్వీర్యం చేయడానికి కుట్ర పన్నుతోందని, నిధులు పెంచి ప్రతి కూలీకి 200 రోజులు పని కల్పించాలన్నారు. ఈనెల 16న తలపెట్టిన దేశ వ్యాప్త సమ్మెలో కార్మిక సంఘాలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. గట్టుమల్లు, పెద్ద మైసయ్య, ఐలయ్య, రాములు, కుమారస్వామి పాల్గొన్నారు.

కార్మిక శాఖ అధికారిపై కలెక్టర్ ఆగ్రహం

జనగామ రూరల్: జిల్లా కార్మిక శాఖ అధికారి కుమారస్వామిపై కలెక్టర్ శివలింగయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ప్రజావాణిలో భాగంగా సీఐటీయూ పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్ కార్మిక శాఖ అధికారిపై ఫిర్యాదు చేశారు. అయితే అప్పటికే అధికారి విధులకు హాజరు కాలేదు. ఆలస్యంగా రావడంతో సమావేశం అనంతరం పద్ధతి మార్చుకోవాలని వార్నింగ్ ఇచ్చారు. గతంలోనూ హెచ్చరించినా మార్పు రాలేదని, ఇప్పటికైనా విధులు సక్రమంగా నిర్వహించకుంటే చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

ఎన్నికల హామీలు నెరవేర్చాలి



జనగామ రూరల్: కల్లుగీత కార్మికులకు ఇచ్చిన ఎన్నికల హామీలు నెరవేర్చాలని కేజీకేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బాల్నె వెంకటమల్లయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులకు ప్రమాదాల నివారణకు సేఫ్టీ మోకులు, ప్రతీ సొసైటీకి ఐదు ఎకరాల భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. నీరా ఉత్పత్తులకు ప్రతి జిల్లాలో పరిశ్రమలు ఏర్పాటు చేయాలని, తాటి, ఈత చెట్లు నరికివేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు హరిప్రసాద్, నరేందర్, సతీష్, మల్లయ్య, నర్సయ్య, బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

సీఎం ఫ్లెక్సీకి పాలాభిషేకం



జనగామ: డాక్టర్ అందెశ్రీ రాసిన జయ జయహే తెలంగాణ గీతాన్ని అధికార గీతంగా ప్రకటించడాన్ని స్వాగిస్తూ జనగామ డీసీసీ కార్యాలయంలో సోమవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఆదేశాల మేరకు సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. టీపీసీసీ సభ్యులు చెంచారపు శ్రీనివాస్‌రెడ్డి, సర్వల నర్సింగరావు, పట్టణ మాజీ అధ్యక్షుడు చెంచారపు బుచ్చిరెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బనుక శివరాజ్, కౌన్సిలర్లు వంగాల కల్యాణి, గాదెపాక రామచంద్రం, జక్కుల వేణు, మాజీ కౌన్సిలర్ మేడ శ్రీనివాస్, పీఏసీఎస్ డైరెక్టర్ వంగాల మల్లారెడ్డి, ఆలేటి సిద్దిరాములు, బడికె కిష్టస్వామి, లింగాల నర్సిరెడ్డి, సుంకరి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వీకరణతోనే సరి..!

పరిష్కారానికి నోచుకోని సమస్యలు

- గ్రీవెన్స్‌కు 66 వినతులు
- సదరం, ధరణి సమస్యలే అధికం



ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరిస్తున్న కలెక్టర్ శివలింగయ్య, అదనపు కలెక్టర్, అధికారులు

జనగామ రూరల్: ‘అర్జీలు ఎన్ని ఇచ్చినా ఫలితం లేదు.. ఏళ్ల తరబడి తిరుగుతున్నా సమస్యలు తీరడం లేదు.. అధికారులు వినతులు స్వీకరించడంతోనే సరిపెడుతున్నారు’ అంటూ అర్జీదారులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌కు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి కలెక్టర్ శివలింగయ్యతో పాటు అదనపు కలెక్టర్లు రోహిత్‌సింగ్, పింకేష్‌కుమార్, ఆయా శాఖల అధికారులు వినతులు స్వీకరించారు. మొత్తం 66 దరఖాస్తులు రాగా.. అందులో భూసంబంధ, సదరం సమస్యలే అధకంగా ఉన్నాయి. ‘కూతురు వద్ద బతుకుతున్నాను. ఎలాంటి ఆధారం లేదు. పింఛన్ ఇప్పించాలంటూ ఒకరు.. అక్రమంగా భూమి పట్టా చేసుకున్నారని మరొకరు.. కరెంట్ మీటరు కోసం ఏడాదిగా తిరుగుతున్నానంటూ ఇంకొకరు.. ఆన్‌లైన్‌లో ఎకరం భూమి కనిపించడం లేదంటూ’ పలువురు వినతులు ఇచ్చారు. అందులో ఆర్డీఓ పరిధిలో 31, రెవెన్యూ విభాగం 17, డీఆర్‌డీఓ 4, ఏడీ సర్వే 3, సంక్షేమాధికారి, విద్యుత్, వ్యవసాయాధికారి, మున్సిపల్ రెండు చొప్పున, డీపీఓ, కలెక్టరేట్ ఏఓ, వైద్య శాఖ ఒకటి చొప్పున దరఖాస్తులు వచ్చాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దివ్యాంగుల, భూ సంబంధ సమస్యలు సత్వరమే పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.



“ పక్క ఫొటోలోని మహిళ పేరు కేశవపట్నం విజయ. జనగామ మండలం పెద్ద రాంచర్ల గ్రామానికి చెందిన ఈమె 30 ఏళ్లుగా బోదకాలు వ్యాధితో బాధపడుతోంది. ఎన్ని ఆస్పత్రులకు తిరిగినా నయం కావడంలేదు. ఎలాంటి ఆధారం లేని ఆమెకు మందులు, ఇంటి ఖర్చులకు ఇబ్బందులు తప్పడంలేదు. ఆసరా పింఛన్ కోసం గతంలో గ్రామ పంచాయతీలో పేరు నమోదు చేసుకున్నా మంజూరు కాలేదు. పింఛన్ ఇప్పించి ఆదుకోవాలని బాధితురాలు కలెక్టర్‌ను వేడుకుంది.

ఆన్‌లైన్‌లో భూమి కనిపించడంలేదు..



నాగిరెడ్డిపల్లి 144 ఏ4 సర్వే నంబర్‌లో ఎకరం 23 గుంటల భూమి మా తల్లి మంద రంగమ్మ పేరు మీద ఉంది. 2017 వరకు రికార్డులో వచ్చింది. గతంలో పాస్ బుక్కులు బ్యాంక్‌లో ఉండడం వల్ల భూమి వివరాలు చూసుకోలేదు. ఇటీవల ఆన్‌లైన్‌లో పరిశీలించగా 26 గుంట భూమి మాత్రమే కనబడుతున్నది. అధికారులను అడిగే వివరాలు తెలియడంలేదని చెబుతున్నారు. న్యాయం చేయాలి.

- మంద తిరుపతి, నాగిరెడ్డిపల్లి(బచ్చన్నపేట)

భూమిని ఆక్రమించారు



మా తండ్రి శివరాత్రి కుమారస్వామి పేరు మీద 23ఏ సర్వే నంబర్‌లో ఎకరం 28 గుంటల భూమి ఉంది. రెండేళ్ల క్రితం భూమిని తండ్రి సంబంధీకులు ఆక్రమించారు. పోలీస్‌స్టేషన్‌కు వెళ్లినా న్యాయం జరగడం లేదు. భూమిని కాపాడి ధరణిలో నమోదు చేయాలి.

- అలకుంట్ల సంధ్య, మీదికొండ(స్టేషన్‌ఘన్‌పూర్)


కరెంట్ మీటరు కోసం ఏడాదిగా..



అరవింద్‌నగర్‌లో ఇల్లు నిర్మించుకున్నాను. పనులు పూర్తయ్యాయి. కరెంట్ మీటరు కావాలని అధికారుల వద్దకు వెళ్తే వేరే ఇంటి నుంచి కనెక్షన్ ఇచ్చారు. కొత్త మీటరు కోసం ఏడాది నుంచి డీఈ, ఏఈల వద్దకు తిరుగుతున్నాను. పట్టించుకోవడం లేదు. పైగా డబ్బులు ఇవ్వాలని బెదిస్తున్నారు. ఇంటికి మీటరు ఇప్పించాలి.

- ఇ.సంతోష్, 8వ వార్డు, జనగామ పట్టణం

న్యాయం చేయండి



చీటకోడూర్ రిజర్వాయర్ పక్కన 267, 163 సర్వే నంబర్లలో 4 ఎకరాల 8 గుంటల భూమి ఉంది. గతంలో కాలువ కింద 20 గుంటల భూమి పోయింది. ప్రస్తుతం 267 సర్వే నంబర్‌లోని భూమి తనదే అంటూ కొందరు 20 గుంటలు ఆక్రమించి పట్టా చేసుకున్నారు. పోలీసులను సంప్రదించినా ఫలితం లేదు. మరింత భూమి ఆక్రమించాలని చూస్తున్నారు. భూమిని సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేసి న్యాయం చేయాలి.

- కూకట్ల బాలనర్సయ్య, చీటకోడూరు(జనగామ)

పింఛన్ బంద్ అయింది..



నాకు కొడుకు, కూతురు ఉన్నారు. కొడుకు ఇటీవల మరణించాడు. కూతురు వద్దే తల దాచుకుంటున్నాను. ఎలాంటి ఆస్తులు లేవు. గతంలో దివ్యాంగురాలి కింద వైఎస్.రాజశేఖరరెడ్డి ఉన్నప్పుడు రూ.500 పింఛన్ వచ్చింది. సర్టిఫికెట్ టైం అయిపోయిందని పింఛన్ బంద్ చేసిండ్లు. నాలుగేండ్ల కింద భర్త మరణించాడు. ఏదైనా పింఛన్ ఇప్పించి ఆదుకోవాలి. ”

- బాస్కుల రాజమ్మ, సరిసన్నగూడెం(పాలకుర్తి)

గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి

- సమీక్షలో కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ శివలింగయ్య పక్కన అదనపు కలెక్టర్లు

జనగామ: ప్రత్యేక అధికారులు గ్రామాల అభివృద్ధికి సమన్వయంతో కృషి చేయాలని కలెక్టర్ సీహెచ్ శివలింగయ్య అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్లు పింకేశ్ కుమార్, రోహిత్‌సింగ్‌తో స్పెషల్ ఆఫీసర్లకు ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నూతన పంచాయతీ యాక్ట్‌లోని ప్రతీ అంశాన్ని అధికారులు తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామాల్లో నిత్యం పారిశుద్ధ్య పనులు చేపట్టాలని, వైకుంఠ ధామాలు, పల్లె ప్రకృతి వనాలు, నర్సరీలతో పాటు రహదారులను స్వచ్ఛతగా ఉండేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ తాగునీరు అందేలా పర్యవేక్షించాలని, నిబంధనల మేరకు మంచినీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. జీపీల పరిధిలో వీధి దీపాల సమస్య తలెత్తకుండా వందశాతం వెలిగేలా చూడాలని, శిథిలావస్థకు చేరిన భవనాలను కూల్చివేయాలన్నారు. ఇంటి, నల్లా పన్నుల వసూళ్లలో వందశాతం లక్ష్యం చేరుకోవాలని, ఆదాయ వనరుల పెంపుతోపాటు బడ్జెట్‌లో 10 శాతం పచ్చదనానికి కేటాయించాలని సూచించారు. ప్రతీ ఇంటిలో మరుగుదొడ్డి నిర్మించుకుని వినియోగించేలా చూడాలని పేర్కొన్నారు. ఈనెల 7 నుంచి 14 వరకు ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించి గుర్తించిన సమస్యలపై ప్రజలతో కలిసి చర్చించాలని చెప్పారు. సమీక్షలో డీపీఓ రంగాచారి, ఆర్డీఓలు మురళీకృష్ణ, రామ్మూర్తి, డీఆర్డీఓ మొగులప్ప, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పీఎం విశ్వకర్మ పథకానికి దరఖాస్తుల ఆహ్వానం

పీఎం విశ్వకర్మ పథకానికి అర్హులు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ అన్నారు. ఈ పథకంపై అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ.. ఈ పథకానికి 18 కులవృత్తులు చేసుకునే వారు దరఖాస్తు చేసుకోవచ్చని, ఇందుకు సంబంధించిన బ్యానర్ ఆవిష్కరించి బ్యాంకులతో పాటు కామన్ సర్వీస్ సెంటర్లలో ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

జనగామ రూరల్ : బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర క్యాలెండర్, డైరీని సోమవారం కలెక్టర్ శివలింగయ్యతోపాటు ఏసీపీ దేవేందర్ ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. భవన నిర్మాణ రంగంలో పని చేస్తున్న కార్మికులు సంక్షేమ ఫలాలు పొందడానికి ఈ–శ్రమ్ కార్డులో వివరాలు నమోదు చేసుకోవాలన్నారు.

పర్యావరణ హిత జనజాతరకు సిద్ధం కావాలి

శ్రీ సమ్మక్క–సారలమ్మ జాతరలో ప్లాస్టిక్ వినియోగించకుండా పర్యావరణ హిత జాతర నిర్వహించేందుకు సిద్ధం కావాలని కలెక్టర్ శివలింగయ్య అన్నారు. ఇందుకు సంబందించిన వాల్ పోస్టర్‌ను అదనపు కలెక్టర్లు, రోహిత్ సింగ్, పింకేష్ కుమార్‌లతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఈఓ రాము, గొసియ బేగం, కన్నా పరశురాములు తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంల తనిఖీని పరిశీలిస్తున్న కలెక్టర్, రాజకీయ పార్టీల ప్రతినిధులు



ఈవీఎంల పరిశీలన

జనగామ: రానున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సోమవారం కలెక్టరేట్ ప్రాంగణంలోని ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లు భద్రపరిచిన గోదాంను కలెక్టర్ శివలింగయ్య ఆధ్వర్యంలో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి ఫస్ట్ లెవెల్ చెకింగ్(ఎఫ్ఎల్‌సి) నిర్వహించారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీఓ రామ్మూర్తి, రాజకీయ పార్టీల ప్రతినిధులు రావెల రవి, ఉడుత రవి, విజయభాస్కర్, జోగు ప్రకాష్, జె.కుమార్, కలెక్టరేట్ పరిపాలన అధికారి పి.రవీందర్, ఎన్నికల విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

రేపు నిరుద్యోగ అభ్యర్థులకు అవగాహన

జనగామ రూరల్: తెలంగాణ ఓవర్‌సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్(టామ్‌కామ్) ఆధ్వర్యంలో జర్మనీలో నర్సింగ్ కోసం విదేశీ ఉద్యోగ నియామకాలను సులభతరం చేయడానికి ఈనెల 7న నిమ్స్ ఆస్పత్రిలో అభ్యర్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి ఉమారాణి తెలిపారు. బీఎస్సీ నర్సింగ్ జీఎన్ఎం, డిప్లొమా హోల్డర్లు అర్హులని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 99088 30438 నంబర్‌లో సంప్రదించాలని ఒక ప్రకటనలో సూచించారు.

‘గృహజ్యోతి’కి డిస్కం సన్నద్ధం

- గృహాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్..
- నేటి నుంచి సర్వీస్ నంబర్లకు తెల్ల రేషన్‌కార్డు, ఆధార్ అనుసంధానం



జిల్లాల వారీగా గృహ వినియోగదారులు

జిల్లా	వినియోగదారులు
హనుమకొండ	3,45,302
వరంగల్	2,86,156
భూపాలపల్లి, ములుగు	1,93,257
జనగామ	1,69,375
మహబూబాబాద్	2,09,066

హన్మకొండ: ఆరు గ్యారంటీల్లో భాగంగా గృహ జ్యోతి పథకం అమలుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఈపథకం కింద గృహాలకు 200 యూనిట్ల విద్యుత్ ఉచితంగా ఇస్తారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి ఆరు గ్యారంటీల అమలులో ఇప్పటికే మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, ఆరోగ్యశ్రీ పరిమితి రూ.10లక్షలకు పెంపు అందుబాటులోకి వచ్చాయి. ఇటీవల మరో రెండు పథకాలు అమలు చేయనున్నట్లు ప్రకటించారు. ఈమేరకు గృహజ్యోతి పథకం కోసం వినియోగదారుల రేషన్ కార్డు, ఆధార్ నంబర్‌ను విద్యుత్ సర్వీస్ నంబర్‌తో అనుసంధానం చేయాలని నిర్ణయించింది. దీంతో ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ రిజ్వీ డిస్కంలకు ఆదేశాలు ఇచ్చారు. సోమవారం వీడియో కాన్ఫరెన్స్‌లో దిశానిర్దేశం చేశారు.

నేటి నుంచి ప్రక్రియ షురూ..

ఎన్పీడీసీఎల్ పరిధి 16 జిల్లాల్లో 45,64,889 మంది గృహ వినియోగదారులున్నారు. ఈనెల 6 నుంచి మీటర్ రీడింగ్‌తో పాటు వినియోగదారుల రేషన్ కార్డు, ఆధార్ నంబర్ తీసుకుని నమోదు చేయాలని సూచించారు. ఈమేరకు యుద్ధ ప్రాతిపదికన సిద్ధం చేస్తున్న సాఫ్ట్‌వేర్ మంగళవారం(నేడు) ఉదయానికి అందుబాటులోకి రానుంది. ప్రతి ఎలక్ట్రిసిటీ రెవెన్యూ కార్యాలయం(ఈఆర్‌ఓ)లో ఉదయం 9 గంటలకు స్పాట్ బిల్లర్లతో సమావేశం ఏర్పాటు చేసి సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్లు, డివిజన్ ఇంజనీర్లు సాఫ్ట్‌వేర్ వినియోగం, మీటర్ రీడింగ్, రేషన్ కార్డు, ఆధార్ నంబర్ల నమోదుపై అవగాహన కల్పించాలని ట్రాన్స్‌కో సీఎండీ.. జిల్లా ఎస్ఈలు, డీఈలు, అకౌంట్స్ ఆఫీసర్లను ఆదేశించారు. ఈమేరకు టీఎస్ ఎన్పీడీసీఎల్‌లో డివిజన్ల వారీగా సమావేశాల ఏర్పాటుకు సిద్ధమవుతున్న అధికారులు మీటింగ్‌కు రావాలని స్పాట్ బిల్లర్లకు సమాచారం ఇచ్చారు. ఇదిలా ఉండగా.. అద్దెకు ఉంటున్న కుటుంబాల ఆధార్, రేషన్ కార్డు నంబర్ నమోదుపై అధికారులు సందేహాలు వ్యక్తం చేయగా నివృత్తి చేశారు. అద్దెకు ఉంటున్న ఇంటి మీటర్ నంబర్‌తో పాటు వారి రేషన్ కార్డు, ఆధార్ నంబర్ నమోదు చేయాలని సూచించారు. ఈ ప్రక్రియతో యజమానులకు ఎలాంటి సమస్యలు తలెత్తవన్నారు. ప్రతి నెలా 15వ తేదీలోపు విద్యుత్ పంపిణీ సంస్థ బిల్లులు జారీ చేస్తుంది. మరో పది రోజుల్లో తెల్లరేషన్ కార్డు వినియోగదారులు తేలనుంది.

ఐలమ్మ స్ఫూర్తితో చట్టసభల్లో వాటా సాధించాలి

- ఆలిండియా ఓబీసీ జాక్ చైర్మన్ నరేందర్




కడవెండిలో దొడ్డి కొమురయ్య స్మారక స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న ఓబీసీ జాక్ నాయకులు

దేవరుప్పుల/పాలకుర్తి టౌన్: చట్టసభల్లో బీసీల వాటా సాధించడానికి చిట్యాల ఐలమ్మ, దొడ్డి కొమురయ్య పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకుని ఉద్యమించాలని ఆలిండియా ఓబీసీ జాక్ చైర్మన్ సాయిని నరేందర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు చేపట్టిన మహా పాదయాత్ర సోమవారం దేవరుప్పుల మండలం కడవెండి, పాలకుర్తికి చేరుకుంది. స్థానికంగా ఉన్న దొడ్డి కొమురయ్య స్మారక స్థూపం, ఐలమ్మ విగ్రహం వద్ద నివాళులర్పించిన అనంతరం నరేందర్ మాట్లాడుతూ.. రెండు శాతం జనాభా ఉన్న వర్గాలకు చట్టసభల్లో ఎక్కువ శాతం సీట్లు కల్పిస్తున్నారని, బీసీల వాటా కోసం నిర్వహించే ఉద్యమాలకు మహిళలు భారీ ఎత్తున తరలిరావాలని కోరారు. ఆల్ ఇండియా ఓబీసీ వైస్ చైర్మన్ వెలుగు వనిత మాట్లాడుతూ ప్రపంచంలో అత్యధికంగా దోపిడీకి గురవుతున్నది బీసీ వర్గాలే అని అన్నారు. ఆయా కార్యక్రమాల్లో హిందూ బీసీ మహాసభ వ్యవస్థాపక అధ్యక్షుడు బత్తుల సిద్దేశ్వర్లు, ఆల్ ఇండియా ఓబీసీ, గౌడ జన హక్కుల పోరాట సమితి నాయకులు గుమ్మడిరాజు సాంబయ్య, కమ్మగాని పరమేశ్వర్, భూమ రంగయ్య, బొమ్మగాని మానసభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

నిధులు కరువు.. సేవకు సెలవు!

- ఎన్ఎస్ఎస్‌కు నిధుల పెంపు.. విడుదలలో జాప్యం
- రావాల్సినవి రూ. 2.67 కోట్లు
- విడుదలైనవి రూ.47 లక్షలు
- కానరాని ప్రత్యేక శిబిరాలు
- పీఎఫ్ఎంఎస్ అకౌంట్లు తీసినా నిధుల వినియోగానికి ఇబ్బందులే



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధి జాతీయ సేవా పథకం(ఎన్ఎస్ఎస్) సామాజిక సేవల్లో ముందుండేది. రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు అందుకున్న ఘనత ఉంది. కానీ ప్రస్తుతం పూర్తి స్థాయిలో నిధులు విడుదలవక సేవలు అంతంత మాత్రంగానే అందించే పరిస్థితి కనిపిస్తోంది. కేంద్రం విడుదల చేసే నిధుల వినియోగంలో అనేక ఆంక్షలుండడంతో సామాజిక సేవా కార్యక్రమాలకు ముందడుగు వేసే పరిస్థితి కనిపించడం లేదు.

నిధుల పెంపు..

కేయూ పరిధిలో ఎన్ఎస్ఎస్ ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ జూనియర్, డిగ్రీ, పీజీ కళాశాలల్లో కలిపి మొత్తం 356 ఎన్ఎస్ఎస్ యూనిట్లు ఉన్నాయి. ఒక్కో యూనిట్‌కు 100మంది చొప్పున 35,600ల మంది వలంటీర్లున్నారు. స్వచ్ఛభారత్, ప్రజల్లో చైతన్యం కలిగించడం ఇలా అనేక సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహణ సందర్భంగా వలంటీర్లకు స్నాక్స్, బ్యానర్లు, సమావేశాలకు సంబంధించిన కార్యక్రమాలకు నిధులు వెచ్చిస్తారు. గతంలో ఒక్కో యూనిట్‌కు రెగ్యులర్ కార్యక్రమాలకు రూ.16 వేలు ఉండేది. ఇప్పుడు రూ 27,500లకు పెంచారు. అదే విధంగా ఎన్ఎస్ఎస్ యూనిట్‌చే వారం రోజులు ఏదైనా గ్రామంలో 50 మంది వలంటీర్లతో ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేస్తే గతంలో 22,500లు ఇచ్చేవారు. దాన్ని రూ.35 వేలకు పెంచారు.

కొత్తగా పీఎఫ్ఎంఎస్ అకౌంట్లు

ఎన్ఎస్ఎస్‌కు విడుదల చేసే నిధులను జవాబుదారీతనంగా వెచ్చించేలా కేంద్ర ప్రభుత్వం ‘మై భారత్ పోర్టల్’ను తీసుకొచ్చింది. ఆతర్వాత కొత్త పబ్లిక్ ఫైనాన్స్ మేనేజ్‌మెంటు సిస్టమ్ (పీఎఫ్ఎంఎస్) ద్వారా బ్యాంకుల్లో ప్రతీ కళాశాలకు సంబంధించిన ఎన్ఎస్ఎస్ యూనిట్లు ఖాతాలు ఓపెన్ చేయాలనడంతో ఎక్కువ శాతం కాలేజీలు ఓపెన్ చేశాయి. కొన్ని కళాశాలలు ఇంకా అకౌంట్లు తీయలేదు.

రూ.47 లక్షల నిధులే విడుదల

కేయూ పరిధిలో ఎన్ఎస్ఎస్‌కు గత విద్యాసంవత్సరంలో నిధులు విడుదల కాలేదు. ఈ విద్యాసంవత్సరం రూ.2.67 కోట్లు విడుదల కావాల్సి ఉండగా.. రూ.47 లక్షలు విడుదలయ్యాయి. దీంతో కొద్దిరోజుల క్రితం నిధులు తక్కువగా ఉండటంతో కేవలం 171 యూనిట్లకు ఒక్కో యూనిట్‌కు రూ.27,500 చొప్పున ఆయా కళాశాలల యూనిట్లకు అధికారులు విడుదల చేశారు. ఆ నిధులన్నీ రెగ్యులర్ కార్యక్రమాలకే వెచ్చించాల్సి ఉంటుంది. విద్యార్థులు ఎక్కువగా ఉండే కళాశాలల్లో నాలుగైదు యూనిట్లు కూడా ఉంటాయి. కళాశాలలో ఎన్ని యూనిట్లు ఉన్నా.. ఒక్క యూనిట్‌కు మాత్రమే విడుదల చశారు. గతంలో ప్రత్యేక శిబిరాల నిర్వహణ అనంతరం బిల్లులు పెట్టుకుంటే వర్సిటీ అధికారులు చెల్లించేవారు. ఇప్పుడా పరిస్థితి లేకపోవడంతో శిబిరాలు నిర్వహించడం లేదని తెలుస్తోంది. ఈసారి ఎన్ఎస్ఎస్ యువజనోత్సవాలు జరగలేదు.

రెమ్యూనరేషన్ ఏది?

కేయూ పరిధిలో 356 మంది ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లకు రెండేళ్ల నుంచి ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లకు రెమ్యూనరేషన్ విడుదల కాలేదు. గతంలో వీరికి ఒక్కొక్కరికి రూ. 6 వేలు ఉండగా.. రూ.8,500లకు పెంచారు. కానీ విడుదల చేయడం లేదు. దీంతో ఎన్ఎస్ఎస్ కార్యక్రమాలపట్ల వారు కూడా విముఖత చూపుతున్నారు. నూతన విధానంతో అనేక ఇబ్బందులతో రాబోయే కాలంలో ఎన్ఎస్ఎస్ యూనిట్లు తగ్గిపోయే అవకాశం కూడా ఉంది.

నిధులు ఖర్చు చేయాలంటే ఇబ్బందులే..

గతంలో వర్సిటీ అధికారులు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లకు ఉమ్మడి జిల్లాల స్థాయిలో సమావేశాలు నిర్వహించి రెగ్యులర్ కార్యక్రమాల నిర్వహణకు నిధుల విడుదల చేసేవారు. పీఎఫ్ఎంఎస్ అకౌంట్, నిబంధనలు, పలు ఆంక్షలతో నిధులను వినియోగించుకోలేకపోతున్నారు. ఈనిధుల వినియోగానికి సంబంధిత కాలేజీ ప్రిన్సిపాల్ అనుమతి ఉండాలి. ఇదంతా ఒక ఎత్తయితే పలు సాంకేతిక సమస్యలూ తలెత్తుతున్నాయని కళాశాలల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు, కేయూ ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ ఆచార్య ఈసం నారాయణ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో గత నెల 29న వరంగల్ కేంద్రంగా, 30న ఖమ్మం జిల్లాలో, 31న ఆదిలాబాద్‌లో ప్రోగ్రాం ఆఫీసర్లకు అవగాహన కల్పించారు. అయినప్పటికీ ఇబ్బందుల తప్పడం లేదని ప్రోగ్రాం ఆఫీసర్లు వాపోతున్నారు.

తక్కువ నిధులు విడుదలయ్యాయి..



కేయూ పరిధి 356 ఎన్ఎస్ఎస్ యూనిట్లు ఉండగా.. రూ.2.67 కోట్లు రావాల్సి ఉంది. కానీ రూ.47 లక్షల నిధులే విడుదలయ్యాయి. అందులో 171 యూనిట్లకు విడుదల చేశాం. అయితే ఆనిధులను వినియోగంపై అవగాహన కల్పించాం. ఈనిధులు పూర్తిగా వినియోగిస్తే మరోసారి విడుదలయ్యే అవకాశం ఉంది. నిధుల కొరత ఎన్ఎస్ఎస్ కార్యక్రమాలపై ప్రభావం చూపుతోంది.

- ఆచార్య ఈసం నారాయణ, కేయూ ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్

పంట నష్టపరిహారం చెల్లించాలి

పట్టణంలో రిలే దీక్షలు ప్రారంభం



సంఘీభావం తెలుపుతున్న నాయకులు

జనగామ: జిల్లాలో గత ఏడాది మార్చి, ఏప్రిల్ నెలల్లో కురిసిన వడగళ్లకు నష్టపోయిన పంటలకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ జనగామ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే యాసారపు కరుణాకర్, ఓయూ జేఏసీ నేత శివరాంగౌడ్ సోమవారం జనగామ పట్టణంలో రిలే దీక్షలు చేపట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ నర్మెట్ట, బచ్చన్నపేట, తరిగొప్పుల, జనగామ రూరల్, కొడకండ్ల, దేవరుప్పుల, పాలకుర్తి, స్టేషన్‌ఘన్‌పూర్, చిల్పూర్, లింగాలఘణపురం, జఫర్‌గఢ్ మండలాల్లో సుమారు 42 వేల ఎకరాల్లో 26 వేల మంది రైతులకు చెందిన పంట నేలపాలైయిందని చెప్పారు. గత ప్రభుత్వం ఎకరానికి రూ.10 వేల పరిహారం ఇస్తామని హామీ ఇచ్చి చేతులు దులుపుకుందన్నారు. ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి ప్రజాపాలనలో నాడు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరారు. రిలే దీక్షలకు గువ్వల రవి, జేరిపోతుల కుమార్, ఇరుగు యకయ్య, నర్రా నవీన్, కొలిపాక శివరాజ్ సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో రైతులు కర్ల ఎలేందర్‌రెడ్డి, ఎర్ర నరహరి, యాసారపు వెంకటేష్, చెండేటి నర్సెళ్లయ్య, సాంబరాజు జంపన్న, తాండ్ర వెంకటేష్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

భూన్యాయ శిబిరాలు వాయిదా

పెద్దవంగర: రైతులకు ఉచితంగా న్యాయ సలహాలు ఇచ్చేందుకు చేపట్టిన భూన్యాయ శిబిరాలను వాయిదా వేసినట్లు లీఫ్స్ సంస్థ సలహాదారు కేతిరెడ్డి కరుణాకర్ దేశాయ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలం చిన్నవంగర గ్రామంలో ఈ నెల 7,8, బొమ్మకల్లులో 16,17, అలాగే, జనగామ జిల్లా పాలకుర్తి మండలం బొమ్మెర గ్రామంలో 12,13 తేదీల్లో నిర్వహించనున్న భూన్యాయ శిబిరాలను మరో తేదీల్లో నిర్వహిస్తామని పేర్కొన్నారు. లీఫ్స్ సంస్థ అధ్యక్షుడు సునీల్ కుమార్ తండ్రి సోమవారం కన్నుమూశారు. దీంతో న్యాయ శిబిరాలను వాయిదా వేస్తున్నట్లు కేతిరెడ్డి వెల్లడించారు.

బాలికపై లైంగికదాడికి యత్నం

బచ్చన్నపేట : మండలంలోని సాల్వాపూర్ గ్రామంలో ఆదివారం సాయంత్రం గ్రామానికి చెందిన ఓ యువకుడు అదే గ్రామానికి చెందిన ఓ బాలికపై లైంగికదాడికి యత్నించినట్లు సమాచారం. ఈ ఘటనపై బాలిక తల్లిదండ్రులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని తెలిసింది. దీంతో పోలీసులు సదరు యువకుడిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

జువైనల్ హోమ్‌కు బాలుడి అప్పగింత

నెల్లికుదురు: బాలిక ఆత్మహత్యకు కారణమైన ఓ బాలుడిని జువైనల్ హోమ్‌కు అప్పగించినట్లు ఎస్సై కె.క్రాంతికిరణ్ తెలిపారు. ఇనుగుర్తి మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక సెల్‌ఫోన్‌కు నెల్లికుదురు మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలుడు నిత్యం అసభ్యకర మెస్సేజ్‌లు పంపుతున్నారు. దీంతో మనస్తాపానికి గురైన బాలిక గత నెల 28న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన కుటుంబీకులు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. ఈ ఘటనలో బాలిక మృతికి కారణమైన బాలుడిని సోమవారం వరంగల్‌లోని జువైనల్ హోమ్‌కు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

నర్సింహులపేట: తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన మండల కేంద్రంలో జరిగింది. ఎస్సై గంద్రాతి సతీష్ కథనం ప్రకారం నర్సింహులపేటకు చెందిన రిటైర్డ్ ఉద్యోగి వేముల ప్రభాకర్‌రెడ్డి తన భార్యతో కలిసి 15 రోజుల క్రితం విజయవాడలో ఉంటున్న తమ కుమారుడి వద్దకు వెళ్లారు. ఈ క్రమంలో సోమవారం ఇంటికి వచ్చి చూసేసరికి ఇంటి తాళం పగలగొట్టి ఉంది. ఇంట్లోని లాకర్‌లో ఉన్న 8 తులాల బంగారం కనిపించలేదు. దీంతో చోరీ జరిగిందని గ్రహించిన ప్రభాకర్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసుకుని క్లూస్ టీమ్‌తో ఆధారాలు సేకరించి దర్యాప్తు చేస్తునట్లు ఎస్సై సతీష్ తెలిపారు.

భక్తులకు మెరుగైన సౌకర్యాలు



సారలమ్మ గద్దె వద్ద పూజలు చేస్తున్న మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్



ఆర్టీసీ బస్టాండ్ ఏర్పాట్ల మ్యాప్‌ను పరిశీలిస్తున్న మంత్రి

- ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయం ప్రకారం జాతర
- మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క
- అధికారులతో సమీక్ష సమావేశం

ఎస్ఎస్‌తాడ్వాయి: మేడారం జాతరకు వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క తెలిపారు. సోమవారం మేడారంలోని హరితహోటల్‌లో మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క, ఆర్టీసీ ఎండీ సజ్జనార్..అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ మేడారం.. దేశంలోనే పెద్ద వన జాతరని, భక్తులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. జాతరకు 6 వేల ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆదివాసీ సంప్రదాయం ప్రకారం జాతర నిర్వహిస్తామన్నారు. 16వ తేదీ నుంచి ఆర్టీసీ క్యాంప్ భక్తులకు అందుబాటులో ఉంటుందన్నారు. జాతర సమయంలో సమస్యలు తలెత్తకుండా ఆర్టీసీ ఎండీ ఆధ్వర్యంలో 10 ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ హామీ మేరకు జాతర సమయంలో కూడా మహిళలకు ఉచిత ప్రయాణా సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. మేడారం జాతరలో ఆర్టీసీ.. ఇప్పటి వరకు లక్షా పదివేల మంది భక్తులకు సేవలు అందించిందని తెలిపారు. 70 వేల మంది మహిళలు ఆర్టీసీ ఉచిత ప్రయాణ సేవలు వినియోగించుకున్నారన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ప్రతి రెండేళ్లకోసారి జరిగే మహాద్భుత ఘట్టం మేడారం జాతరని, భక్తుల సౌకర్యార్థం రూ. 105 కోట్లతో అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సమావేశంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి, పీఓ అంకిత్, ఎస్పీ శబరీశ్, అడిషనల్ కలెక్టర్ శ్రీజ, అధికారులు పాల్గొన్నారు. అనంతరం మేడారం ఆర్టీసీ బస్టాండ్‌లో నాలుగు లహరి నాన్ ఏసీ స్లీపర్ కమ్ సీటర్ బస్సులను మంత్రులు పొన్నం, సీతక్క ప్రారంభించారు. అనంతరం వీఐపీ పార్కింగ్ వరకు బస్సులో ప్రయాణించారు.

ఆర్టీసీ ఏర్పాట్లను పరిశీలించిన మంత్రులు

మేడారంలో ఆర్టీసీ ఆధ్వర్యంలో చేపట్టిన ఏర్పాట్లను మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జాతరకు వచ్చే బస్సులు, పార్కింగ్ స్థలాలు, బస్ షెల్టర్లు, క్యూలైన్ వార్డులు, ఆర్టీసీ ఉద్యోగుల షెల్టర్లు, తదితర వివరాలను ఆర్టీసీ ఎండీ సజ్జనార్, ఉన్నతాధికారులు మంత్రులకు వివరించారు. అనంతరం మంత్రులు సమ్మక్క–సారలమ్మను దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ సంప్రదాయ ప్రకారం ఈఓ రాజేంద్రం, పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్ధబోయిన జగ్గారావు, పూజారులు డోలువాయిద్యాలతో మంత్రులు, ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌కు ఘన స్వాగతం పలికారు. అనంతరం వారిని సన్మానించి ప్రసాదం అందజేశారు.

పోలీసుల అదుపులో చిట్‌ఫండ్ యాజమాన్యం?

- మృతుడు, డైరెక్టర్ భాస్కర్ రెడ్డి సూసైడ్ నోట్ లభ్యం
- దీని ఆధారంగా తిరుపతిరెడ్డి, కమలాకర్‌రెడ్డి అరెస్టు!
- న్యాయం చేయాలని బాధితుల ఆందోళన



పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న బాధితులు

వరంగల్ క్రైం/ హసన్‌పర్తి : కనకదుర్గ చిట్‌ఫండ్ డైరెక్టర్ నల్ల భాస్కర్ రెడ్డి(35) ఆత్మహత్య కేసులో పోలీసులు యాజమాన్యాన్ని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. హనుమకొండలోని హోటల్ హరిత కాకతీయలో ఆదివారం ఆత్మహత్యకు పాల్పడిన భాస్కర్‌రెడ్డి (35) మృతి కేసు పలు మలుపులు తిరిగింది. తన ఆత్మహత్యకు కనకదుర్గ చిట్‌ఫండ్ యాజమాన్యం రాగిడి తిరుపతిరెడ్డి, కమలాకర్‌రెడ్డి కారణమంటూ భాస్కర్‌రెడ్డి సూసైడ్ నోట్ లభించడం సంచలనంగా మారింది. సూసైడ్ నోట్‌లో చిట్‌ఫండ్ యాజమాన్యం కారణమని ఉండడంతో మృతుడి కుటుంబీకులు, బంధువులు కేయూ పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా చేపట్టారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు చిట్‌ఫండ్ యాజమాన్యం రాగిడి తిరుపతిరెడ్డి, కమలాకర్‌రెడ్డిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. కమలాకర్‌రెడ్డిని కేయూ పోలీసులు అదుపులోకి తీసుకుని సుబేదారి పోలీసులకు అప్పగించారు. కాగా, రాగిడి తిరుపతిరెడ్డి మోసం కారణంగా భాస్కర్ రెడ్డి మృతి చెందాడని, ఈ ఘటనపై తిరుపతిరెడ్డిపై చర్యలు తీసుకుని కష్టమర్ల డిపాజిట్లను వెంటనే తిరిగి ఇవ్వాలని మృతుడి బంధువులు డిమాండ్ చేశారు. తమకు న్యాయం జరిగే వరకూ అంత్యక్రియలు జరమని తేల్చి చెప్పడంతో పోలీసులు చొరవ తీసుకుని న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో సోమవారం రాత్రి 9 గంటల ప్రాంతంలో భాస్కర్ రెడ్డి అంత్యక్రియలు నిర్వహించారు. కాగా, చిట్‌ఫండ్ యాజమాన్యం పోలీసులు అదుపులో ఉన్నప్పటికీ పోలీసు ఉన్నతాధికారులు మాత్రం ధ్రువీకరించడం లేదు. ఈ విషయంపై సుబేదారి సీఐ షుకూర్‌ను వివరణ కోరగా భాస్కర్‌రెడ్డి కుటుంబీకులు సూసైడ్ నోట్ అందజేశారన్నారు. దీంతో ఈ కేసులో సెక్షన్లు మార్పు చేశామన్నారు. భాస్కర్‌రెడ్డి ఆత్మహత్యకు యాజమాన్యమే కారణమనే ఆరోపణలపై వారిని వివరణ కోరుతూ నోటీసులు జారీ చేసినట్లు సీఐ తెలిపారు.

కాజీపేట జంక్షన్‌లో అయోధ్య రైలు



కాజీపేటలో అయోధ్య రైలు వద్ద రైల్వే అధికారులు

కాజీపేట రూరల్: సికింద్రాబాద్–అయోధ్య వెళ్లే ప్రత్యేక రైలు సోమవారం సాయంత్రం 6:40 గంటలకు చేరుకుంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సెక్యూరిటీ రీజన్స్ దృష్ట్యా ఆర్పీఎఫ్ అసిస్టెంట్ సెక్యూరిటీ కమిషనర్ శైలేశ్‌కుమార్, కాజీపేట సీఐ సంజీవరావు, కాజీపేట స్టేషన్ మేనేజర్ సత్యనారాయణ, రైల్వే సీసీఐ సజ్జన్‌లాల్, అన్ని విభాగాల సూపర్‌వైజర్లు, రైల్వే అధికారులు, మెకానిక్ సిబ్బంది ప్రత్యేక రైలు వద్దకు చేరుకున్నారు. 6:55 గంటలకు బయల్దేరి వెళ్లింది. కాగా.. ఈ రైలులో కాజీపేట జంక్షన్ నుంచి ఎవరూ ఎక్కలేదని రైల్వే అధికారులు తెలిపారు.

నేడు ప్రత్యేక రైళ్ల సర్వీస్‌ల ప్రారంభం

కాజీపేట జంక్షన్ నుంచి కాజీపేట–అయోధ్య వరకు మంగళవారం నుంచి ప్రత్యేక రైళ్ల సర్వీస్‌లను దక్షిణ మధ్య రైల్వే అధికారులు ప్రారంభించనున్నారు. ఈమేరకు మంగళవారం అయోధ్య రైలును ప్రారంభించి పంపించే ఏర్పాట్లలో ఉన్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఈరైలు కాజీపేట జంక్షన్ నుంచి మంగళవారం సాయంత్రం 6:20 గంటలకు బయల్దేరి వెళ్లనున్నట్లు తెలిపారు. 20 బోగీలతో కూడిన ఈ ప్రత్యేక రైలులో ఉమ్మడి జిల్లా నుంచి 1,300 మంది ప్రయాణికులు కాజీపేట రైల్వే స్టేషన్ నుంచి వెళ్లనున్నట్లు అధికారులు తెలిపారు. బీజేపీ నాయకులు, అధికారులు అయోధ్య ప్రత్యేక రైలు అధికారికంగా పంపించే కార్యక్రమంలో పాల్గొంటున్నట్లు తెలిపారు. కాజీపేట జంక్షన్ నుంచి అయోధ్యకు ప్రయాణికులు వెళ్లనున్నట్లు తెలిపారు. కాజీపేట–అయోధ్య, అయోధ్య–కాజీపేట (07223/07223) మధ్య 30 రైళ్ల సర్వీస్‌లను మార్చి 2వ తేదీ వరకు ప్రవేశపెట్టి నడిపిస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

సికింద్రాబాద్–సుబేదార్‌గంజ్ మధ్య ప్రత్యేక రైళ్లు

- ఈ నెల 8 నుంచి అమలు

కాజీపేట రూరల్ : ప్రయాణికుల సౌకర్యార్థం కాజీపేట జంక్షన్ మీదుగా సికింద్రాబాద్–సుబేదార్‌గంజ్ స్టేషన్ వరకు 16 రైళ్ల సర్వీస్‌లను నడిపిస్తున్నట్లు రైల్వే అధికారులు సోమవారం తెలిపారు. ప్రత్యేక రైళ్ల సర్వీస్‌ల వివరాలు ఈ విధంగా ఉన్నాయి. సికింద్రాబాద్–సుబేదార్‌గంజ్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 8వ తేదీ నుంచి మార్చి 28వ తేదీ వరకు, సుబేదార్‌గంజ్–సికింద్రాబాద్ (04121) ఎక్స్‌ప్రెస్ ప్రతి శుక్రవారం కాజీపేట జంక్షన్‌కు 18.00 గంటలకు చేరుకుంటుంది. అదేవిధంగా ఈ నెల 10వ తేదీ నుంచి మార్చి 30వ తేదీ వరకు సికింద్రాబాద్–సుబేదార్‌గంజ్ (04122) ఎక్స్‌ప్రెస్ ప్రతి ఆదివారం కాజీపేటకు ఉదయం 8.00 గంటలకు చేరుకుటుంది. ఈ రైలుకు కాజీపేట సబ్ డివిజన్ పరిధిలో నాగపూర్, బల్లార్షా, సిర్పూర్‌కాగజ్‌నగర్, మంచిర్యాల, పెద్దపల్లి, కాజీపేట రైల్వే స్టేషన్లలో హాల్టింగ్ కల్పించారు.

భవ్య కుటుంబీకుల రాస్తారోకో

- తప్పుడు ప్రచారంపై ఆగ్రహం



రాస్తారోకో చేస్తున్న భవ్య కుటుంబ సభ్యులు

ఖానాపురం: యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని ఎస్సీ హాస్టల్‌లో అనుమానాస్పద స్థితిలో ఇరువురు విద్యార్థినులు మృతి చెందిన విషయం విధితమే. కాగా, ఖానాపురం మండలం బుధరావుపేట గ్రామానికి చెందిన కోడి భవ్య మృతదేహాన్ని ఆదివారం సాయంత్రం స్వగ్రామానికి తీసుకొచ్చి జిల్లేడు చెట్టుతో వివాహం జరిపించి అంత్యక్రియలు నిర్వహించారు. అనంతరం భవ్య మృతికి కారకులను శిక్షించాలని డిమాండ్ చేస్తూ గ్రామంలోని జాతీయ రహదారిపై రాస్తారోకో చేపట్టారు. ఆటోడ్రైవర్‌తో పాటు వార్డెన్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని, ఉన్నతాధికారులు, స్థానిక ఎమ్మెల్యే రాస్తారోకో వద్దకు చేరుకుని స్పష్టమైన హామీ ఇవ్వాలని బైఠాయించారు. మృతదేహంతో రోడ్డుపైనే నిలవడంతో భారీగా వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న ఎస్సై మాధవ్‌గౌడ్ సిబ్బందితో కలిసి ఘటనా స్థలికి చేరుకుని సముదాయించే ప్రయత్నం చేశారు. కాగా, సామాజిక మాధ్యమాల్లో భవ్య అనారోగ్యంతో మృతి చెందిందని తప్పుడు ప్రచారం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని, ఉన్నతాధికారులు, ఎమ్మెల్యేను పిలిపిస్తేనే రాస్తారోకో విరమిస్తామని పోలీసులతో వాగ్వాదానికి దిగారు. తప్పుడు ప్రచారం చేసిన వారిపై ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని ఎస్సై హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు.

వారిని శిక్షించండి..

'నా కూతురును చంపిన వారిని చంపేయండి.. అన్యాయంగా నా బిడ్డను పొట్టనబెట్టుకున్నారు..నా బిడ్డ మృతిపై అనుమానాలు ఉన్నాయి..అందరు కలిసి మా కుటుంబానికి అన్యాయం చేత్తాండ్లు.. నా బిడ్డ ఒంటిపై దెబ్బలు ఉన్నాయి. చంపినోళ్లను వదిలేయవద్దంటూ' భవ్య తల్లి లలిత రోదించిన తీరు గ్రామస్తులను కలచివేసింది. నా బిడ్డను చంపినవారిని వదిలేయొద్దు. వారిని కఠినంగా శిక్షిస్తేనే నా బిడ్డ ఆత్మ శాంతిస్తదంటూ బోరున విలపించారు. కాగా, ఎస్సై మాధవ్‌గౌడ్.. భవ్య అంత్యక్రియల్లో పాల్గొని పాడే మోశారు.

గుప్తనిధుల కోసం తవ్వకాలు

- పూజలు.. మేకపిల్ల బలి
- పెద్దపహాడ్‌లో అర్ధరాత్రి హల్‌చల్..
- రెండు బైక్‌లు వదిలి కారులో పరార్
- 100 డయల్‌కు ఫోన్.. పోలీసుల విచారణ
- అదుపులో ఇద్దరు వ్యక్తులు



తవ్వకాలు చేపట్టిన గుంతలో మేక పిల్ల

జనగామ: జనగామ మండల పరిధి పెద్దపహాడ్ గ్రామం వెంకిర్యాలకు వెళ్లే దారి.. దండు సిద్దులు, కాటబోయిన రాములు వ్యవసాయ బావి వద్ద కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం అర్ధరాత్రి గుప్త నిధుల కోసం తవ్వకాలు చేపట్టినట్లు మాట్లాడుకుంటున్నారు. రెండు బైక్‌లు, ఓ కారులో అక్కడికు వచ్చిన వ్యక్తులు గతంలో ఉన్న గుంతలో నిమ్మకాయలతో పూజలు చేసి మేక పిల్లను బలిచ్చి అందులో వేశారు. సిద్దులు స్నేహితుడు అదే రోజు రాత్రి వెంకిర్యాలకు వెళ్తుండగా వ్యవసాయ బావి వద్ద కారు, బైక్‌లు అనుమానాస్పదంగా కనిపించడంతో సమీపానికి చేరుకున్నాడు. మనుషుల కదలికలు కనిపించడంతోపాటు పాకలో ఉన్న పశువులు బయటకు వచ్చి అరుస్తుండగా.. సిద్దులుకు గ్రామస్తులకు ఫోన్ చేయడంతో అక్కడికి చేరుకున్నారు. ఇంతలోనే గుర్తు తెలియని వ్యక్తులు బైక్‌లు అక్కడే వదిలేసి కారులో పారిపోయినట్లు సిద్దులు తెలిపారు. 100 నంబర్‌కు డయల్ చేయగా పోలీసులు వచ్చి విచారణ చేపట్టి బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఏడాదిన్నర క్రితం ఇదే ప్రదేశంలో గుప్త నిధుల కోసం తవ్వకాలు జరగ్గా.. స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాజా సంఘటనకు సంబంధించి ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. ఎస్సై సృజన్ మాట్లాడుతూ గుప్త నిధుల కోసం తవ్వకాలు చేయలేదని, ఇంట్లో కుటుంబ సభ్యులకు ఆరోగ్యం బాగోలేక పోవడంతో అడవిలో పూజలు చేసినట్లు చెబుతున్నారని పేర్కొన్నారు. సంబంధిత వ్యక్తుల ఇళ్లలో అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారు ఉన్నట్లు వెల్లడించారు.

రూ.200 కోట్లతో 'టెక్నికల్ హబ్'

- కార్యరూపం దాల్చనున్న మంత్రి సురేఖ కృషి
- తెలంగాణలో ఏకైక టెక్నికల్ సెంటర్

ఖిలా వరంగల్: వరంగల్ జిల్లాలో రూ.200 కోట్ల వ్యయంతో టెక్నికల్ హబ్ ఏర్పాటుకు రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ చేసిన కృషి ఫలించింది. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా 20 టెక్నికల్ సెంటర్లను ఏర్పాటు చేసేందుకు నిర్ణయించగా.. వాటిలో ఒక హబ్ ఖిలా వరంగల్ మండల పరిధి రంగశాయిపేటలో ఏర్పాటు చేసేందుకు నిర్ణయించారు. మూడు దశాబ్దాల సుదీర్ఘ రాజకీయ అనుభవం.. మంత్రి కొండా సురేఖ పట్టుదలతో చేసిన ప్రయత్నాలు ఎట్టకేలకు ఫలించాయి. వరంగల్ జిల్లా కేంద్రంలో టెక్నికల్ సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర మంత్రి మండలి సోమవారం అంగీకారం తెలిపింది. ఈ టెక్నికల్ సెంటర్ భవన నిర్మాణం, ప్లాంట్, యంత్రాల ఏర్పాటు కోసం కేంద్ర ప్రభుత్వం రూ.200 కోట్లు పెట్టుబడిగా పెట్టనుంది. నగరంలో స్థాపించనున్న ఈ సెంటర్‌ను విశేషమైన సామర్థ్యంతో నిర్మించేందుకు కేంద్ర ప్రభుత్వం సంకల్పించింది. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు అధునాతన సాంకేతికతను సమకూర్చడం, నైపుణ్యం కలిగిన మానవ వనరుల సృష్టి, సాంకేతిక నైపుణ్యాభివృద్ధి, సాంకేతిక, వ్యాపార సలహాలు అందించడం వంటి అంశాల్లో ఈ టెక్నికల్ సెంటర్ ప్రధాన పాత్ర పోషించనుంది. పలు రకాల పరిశ్రమలకు అవసరమైన సేవలను అనుసరించి టెక్నికల్ సెంటర్ శిక్షణా కార్యక్రమాలను చేపడుతోంది. నిర్మాణ, ఎలక్ట్రికల్, ఫౌండ్రీ లెదర్, గ్లాస్, స్పోర్ట్స్ వంటి వివిధ రంగాలు టెక్నికల్ సెంటర్లు సేవలను అందిస్తాయి. టక్నికల్ సెంటర్ ఏర్పాటు వరంగల్ జిల్లా చరిత్రలో మైలురాయిగా నిలువనుంది. వేలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించే హబ్ ఏర్పాటు ప్రకటనతో వరంగల్ ప్రజల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. పట్టుదలతో వరంగల్ టెక్నికల్ సెంటర్ స్థాపనకు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించిన మంత్రి సురేఖను ప్రజలు అభినందనలు తెలిపారు.

కుక్కల దాడి.. 25 గొర్రెల మృత్యువాత

- రూ.2.50 లక్షల నష్టం

వేలేరు : మండలంలోని శాలపల్లి శివారు లక్ష్మీతండా గ్రామంలో కుక్కల దాడిలో గుగులోత్ చిరంజీవికి చెందిన 25 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. మరో పదిహేను తీవ్రంగా గాయపడ్డాయి. బాధితుడి కథనం ప్రకారం.. రోజుమాదిరిగానే గొర్రెల మందను తన వ్యవసాయ బావివద్ద కొట్టంలో ఉంచాడు. చిరంజీవి సోమవారం ఉదయం ఇంటికి వెళ్లగా కొట్టం వద్ద ఎవరూ లేని సమయంలో వీధి కుక్కలు ఒక్కసారిగా మందపై దాడి చేశాయి. ఈ దాడిలో 25 గొర్రెలు మృత్యువాత పడగా మరో పదిహేను తీవ్రంగా గాయపడ్డాయి. మృత్యువాత పడిన గొర్రెల విలువ సూమారు రూ.2.50 లక్షల వరకు ఉంటుందని బాధితుడు కన్నీటి పర్యంతమయ్యాడు. తనను ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు. కాగా, గ్రామంలో కుక్కల నియంత్రణకు అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



గొర్రెల కళేబరాలు

హైనా దాడిలో దూడ..

తరిగొప్పుల: హైనా దాడిలో లేగదూడ మృత్యువాత పడింది. మండల కేంద్రానికి చెందిన పింగిళి యాదిరెడ్డి పశువుల పాకపై సోమవారం తెల్లవారుజామున హైనా దాడి చేసి అందులో ఉన్న లేగదూడను హతమార్చింది. కాగా, కొద్ది రోజులుగా మండలంలోని పలు గ్రామాల్లో హైనా దాడి చేసి దూడలను హతమారుస్తుండడంతో రైతులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు.అటవీ శాఖ అధికారులు స్పందించి హైనాను బంధించాలని కోరుతున్నారు.

కేయూ పాలకమండలి సమావేశం



కేయూ క్యాంపస్: కేయూ పాలకమండలి సమావేశాన్ని సోమవారం సాయంత్రం హైదరాబాద్‌లో రాష్ట్ర ఉన్నత విద్యామండలి కార్యాలయంలో నిర్వహించారు. తెలంగాణ విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, ఉన్నత విద్యా కమిషనర్ బుర్రా వెంకటేశం, ఫైనాన్స్ డిప్యూటీ సెక్రటరీ చంద్రకళ, కేయూ వీసీ తాటికొండ రమేశ్, రిజిస్ట్రార్ మల్లారెడ్డి పాల్గొన్నట్లు సమాచారం. ఇటీవల కేయూ రిజిస్ట్రార్, ఇతర పరిపాలనాపదవుల్లో పలువురు ప్రొఫెసర్లను నియమించిన విషయం తెలిసిందే. వీరికి సంబంధించిన ర్యాటిఫికేషన్‌ను ఈసమావేశంలో పెట్టినట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

బీటెక్, ఎంటెక్ పరీక్ష ఫలితాల విడుదల



పరీక్షల ఫలితాలు చూపిస్తున్న వివిధ శాఖాధిపతులు

నయీంనగర్: గ్రేటర్ వరంగల్ కిషన్‌పుర చైతన్య (డీమ్డ్ టు బి యూనివర్సిటీ) యూజీ 3, 5 పీజీ 3 సెమిస్టర్, బీటెక్, బీఫార్మసీ 3, 5, ఎంటెక్. ఎం.ఫార్మసీ 3 సెమిస్టర్ పరీక్షల ఫలితాలను కులపతి డాక్టర్ సీహెచ్.వి.పురుషోత్తంరెడ్డి విడుదల చేశారు. యూజీ 3, 5వ సెమిస్టర్ పరీక్షల్లో మొత్తం 9,69 మంది విద్యార్థు హాజరుకాగా.. 743 మంది, పీజీ 3వ సెమిస్టర్‌లో 234 మంది పరీక్షలకు హాజరు కాగా.. 203 మంది, బీటెక్, బీఫార్మసీ 3, 5వ సెమిస్టర్లలో 591 హాజరుకాగా 432 మంది, ఎంటెక్ 3వ సెమిస్టర్‌లో హాజరైన ఆరుగురు విద్యార్థులు, ఎం.ఫార్మసీ 3వ సెమిస్టర్‌లో హాజరైన 15 మంది ఉత్తీర్ణులయ్యారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఎం.రవీందర్, ఓఎస్‌డి. డా.వీరవెంకటయ్య, ఆచార్యులు జి.శంకర్‌లింగం, వి.మల్లికార్జున్, ఎస్.కవిత, ఎస్.సుమ, ఎం.జగదీశ్వర్, వివిధ శాఖాధిపతులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురి మృతి

వేర్వేరు ప్రమాదాల్లో సోమవారం ఉమ్మడి వరంగల్ జిల్లాలో నలుగురి మృతి చెందారు. ద్విచక్రవాహనాలు అదుపు తప్పడంతో ఇద్దరు యువకులు, ఆటో, కారు ఢీకొన్న ఘటనలో మరో యువకుడు, రైలు ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందారు. దీంతో ఆయా కుటుంబాల్లో విషాదం నెలకొంది.



సాయిప్రసాద్ (ఫైల్)

చిల్పూరు : మండలంలోని నష్కల్ గ్రామానికి చెందిన ఫొటోగ్రాఫర్ మెరుగు సాయిప్రసాద్ (24) ఆదివారం అర్ధరాత్రి ద్విచక్ర వాహనం అదుపుతప్పి బలంగా చెట్టుకు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. గ్రామానికి చెందిన బుచ్చయ్య–కమల దంపతుల కుమారుడు సాయిప్రసాద్ గ్రామంలోనే ఫొటోస్టూడియో ఏర్పాటు చేసుకున్నాడు. ఆదివారం కాజీపేట మండలం వనమాలకనపర్తిలో ఫొటోలు తీసేందుకు వెళ్లాడు. రాత్రి ఇంటికి వచ్చే ముందు భార్య శ్రీవాణికి ఫోన్ చేశాడు. అర్ధరాత్రి అవుతున్నా తమ కుమారుడు ఇంటికి రాకపోవడంతో తండ్రి బుచ్చయ్య ఫోన్‌చేయగా రింగ్ అవుతున్నా లిఫ్ట్ చేయలేదు. దీంతో ప్రోగ్రాంకు పిలిచిన వారికి ఫోన్ చేసి అడుగగా ఎప్పుడో వెళ్లాడని తెలిపారు. దీంతో కుటుంబ సభ్యులు, మిత్రులు వనమాల కనపర్తికి వెళ్తుండగా మార్గమధ్యలో ద్విచక్రవాహనం కనిపించింది. వెంటనే సాయిచంద్‌ను లేపే ప్రయత్నం చేయగా అప్పటికే మృతి చెంది ఉన్నాడు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

ఆర్థికసాయం అందించిన జిల్లా ఫొటోగ్రాఫర్లు

తోటి ఫొటోగ్రాఫర్ మృతి చెందిన విషయం తెలియగానే సోమవారం సాయంత్రం గ్రామానికి చేరుకుని మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆర్థికసాయంగా రూ. 10 వేలు అందజేశారు. పరామర్శించిన వారిలో ఎంపీటీసీ పాశం శిరీష సురేష్, కర్ణకంటి వెంకటేష్, చాగంటి మణి, కేరపాటి సాంబయ్య, అనిల్, సంఘం జిల్లా కార్యదర్శి కర్ణకంటి నాగరాజు, కీర్తి ప్రవీణ్, సంతోష్, అన్వేష్, గంటె ఉపేందర్‌యాదవ్ తదితరులు ఉన్నారు.

కాసిరాజిగూడెం సమీపంలో వ్యక్తి..



జానీ మృతదేహం

డోర్నకల్: మహబూబాబాద్, ఖమ్మం జిల్లా సరిహద్దులో ఆదివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో డోర్నకల్ మండలం ముల్కలపల్లికి చెందిన వ్యక్తి మృతి చెందాడు. ముల్కలపల్లికి చెందిన ఎండీ జానీ(45) ఖమ్మం బైపాస్‌లో పాన్‌షాప్ పెట్టుకుని అక్కడే నివాసం ఉంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం రాత్రి ఖమ్మం రూరల్ మండలం కాసిరాజిగూడెం నుంచి ద్విచక్రవాహనంపై ఖమ్మం వెళ్తుండగా కాసిరాజిగూడెం సమీపంలో వాహనం అదుపు తప్పి కింద పడడంతో తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం జానీని ఖమ్మం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ఆటో, కారు ఢీ.. యువకుడి దుర్మరణం



శ్రీకాంత్ (ఫైల్)

కురవి: ఆటో, కారు ఢీకొన్న సంఘటనలో యువకుడు మృతి చెందాడు. ఈ ప్రమాదం ఆదివారం రాత్రి జరిగిందని సీరోలు ఎస్సై విజయ్‌రాంకుమార్ సోమవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మరిపెడకు చెందిన బాష్పంగు శ్రీకాంత్(28) ఆటోడ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం గడుపుతున్నాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి ఆటోను నడుపుకుంటూ మహబూబాబాద్ నుంచి మరిపెడకు వెళ్తున్నాడు. మహబూబాబాద్‌కు చెందిన వెన్నం వెంకటేష్ కారును నడుపుకుంటూ హైదరాబాద్ నుంచి మహబూబాబాద్‌కు వస్తున్న క్రమంలో ఎదురెదురుగా కొత్తూరు(సీ) శివారు గుజిలి తండా సమీపంలోని రైస్‌మిల్లు వద్ద 365 జాతీయ రహదారిపై ఢీకొన్నట్లు ఎస్సై తెలిపారు. ఈ ఘటనలో ఆటోడ్రైవర్ శ్రీకాంత్‌కు తీవ్రగాయాలు కాగా మహబూబబాద్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి బంధువు మధుకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రైలు ఢీకొని వ్యక్తి దుర్మరణం

డోర్నకల్: గుండ్రాతిమడుగు రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తు తెలియని రైలు ఢీకొని ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. డోర్నకల్ జీఆర్పీ ఎస్సై సురేష్ కథనం ప్రకారం.. కురవి మండలం గుండ్రాతిమడుగు గ్రామానికి చెందిన కోతుల వెంకన్న(60) పశువులను మేపేందుకు సోమవారం గుండ్రాతిమడుగు రైల్వే స్టేషన్ సమీపానికి వెళ్లాడు. ఈ క్రమంలో కిలోమీటర్ నంబర్ 245 వద్ద గుర్తు తెలియని రైలు ఢీకొని మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మహబూబాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అనంతరం మృతుడి కుమారుడు రఘు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

క్లుప్తంగా

అదనపు కలెక్టర్‌ను కలిసిన రియల్ ఎస్టేట్ కమిటీ



జనగామ: జిల్లా రియల్ ఎస్టేట్ నూతన కమిటీ కార్యవర్గ సభ్యులు సోమవారం రెవెన్యూ విభాగం అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లా రియల్ ఎస్టేట్ అసోసియేషన్ అధ్యక్షుడు మందడి శ్రీనివాస్ రెడ్డి, గౌరవ అధ్యక్షుడు దామోదర్ రెడి, బక్క శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఎండి అబ్దుల్ ఖాదర్, కోశాధికారి బత్తిని న ర్సింఐ హులు, సహాయ కార్యదర్శి బొమ్మ కంటి అనిల్, కార్యవర్గ సభ్యులు అంజాజి, పాశం శ్రీనివాస్, ఆంజనేయులు, కృష్ణమూర్తి, తొట్టి కృష్ణ, సతీష్, చంద్రమౌళి ఏసీని శాలువాతో సత్కరించారు. అనంతరం ఏసీపీ దేవేందర్ రెడ్డి, సబ్ రిజిస్ట్రార్ సంపత్ కుమార్, సీఐ ఎల బోయిన శ్రీనివాస్‌లను కలిసి సత్కరించారు.

విద్యార్థినుల మృతికి కారకులను శిక్షించాలి

జనగామ: యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో ఎస్సీ వసతి గృహంలో ఇద్దరు విద్యార్థినులు భవ్య, వైష్ణవి మృతికి కారకులైన నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించాలని జనగామ సామాజిక సేవా కార్యకర్త వంగ భీమ్‌రాజ్ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ హాస్టళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, వార్డెన్ల పనితీరును పర్యవేక్షించాలన్నారు. ఇద్దరు విద్యార్థినుల మృతిపై సమగ్ర విచారణ జరిపించాలన్నారు.

పోలీస్ కళాజాతా

జనగామ రూరల్: మూఢనమ్మకాలు, బాల్యవివాహాల వల్లజరిగే అనార్థాలపై సోమవారం మండలంలోని యశ్వంతాపూర్‌లో పోలీస్ కళాజాతా నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఏసీపీ దేవేందర్ రెడ్డి, సీఐ శ్రీనివాస్ ఎస్ఐలు సృజన్, శ్వేతలు పాల్గొని మాట్లాడారు. గ్రామస్తులు, విద్యార్థులు, యువత పాల్గొన్నారు.

నియామకం

బచ్చన్నపేట: కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఆదేశాల మేరకు 26 గ్రామాల గ్రామ కమిటీలను ఎన్నుకోవడానికి మండల సమన్వయ కమిటీ సభ్యులను సోమవారం నియమించారు. సభ్యులుగా నల్లగోని బాలకిషన్‌గౌడ్, మసూద్, అల్వాల ఎల్లయ్య, నిడిగొండ శ్రీనివాస్, జంగిటి విద్యానాథ్, ఆరుగొండ పర్శరాములు, నూకల బాల్‌రెడ్డి, బొమ్మెర్ల మేణువందన, ఈదులకంటి వెంకట్ రెడ్డి, రామిని మధన్‌మోహన్, బండకింది హరిబాబు, జిల్లెల్ల దయాకర్‌రెడ్డి, బందారం క్రాంతికుమార్, గార్లపాటి మహిపాల్‌రెడ్డి, గాలి కృష్ణలను నియమించారు.

ఆర్థికసాయం

చిల్పూరు: మండలంలోని లింగంపల్లికి చెందిన రాచకొండ ఉపేంద్ర సోమవారం అనారోగ్యంతో మృతిచెందింది. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకుడు, మాజీ సర్పంచ్ ఏదునూరి రవీందర్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.2 వేల సాయం చేశారు.

మాజీ సర్పంచ్ మృతి



నివాళులర్పిస్తున్న శ్రీహరి

రఘునాథపల్లి: మండలంలోని ఖిలాషాపూర్ మాజీ సర్పంచ్ దూడల యాదగిరిగౌడ్ (65) అనారోగ్యంతో సోమవారం తెల్లవారుజామున మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి గ్రామానికి చేరుకొని మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధితకుటుంబ సభ్యులను పరామర్శించారు. బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.కుమార్‌గౌడ్, మాజీ జెడ్పీటీసీ మారుజోడు రాంబాబు, మండల అధ్యక్షుడు వారాల రమేష్, నాయకులు బాల్నె రాజయ్య, జిట్టె వీరస్వామి, శంకర్, రాజయ్య, కుమార్ ఉన్నారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు



జనగామ: పట్టణంలోని ఆర్టీసీ చౌరస్తా సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. లింగాలఘనపురం మండలం కొత్తపల్లికి చెందిన మరాటి నర్సయ్య తన భార్యతో కలిసి జనగామకు వచ్చారు. ఆర్టీసీ చౌరస్తా నుంచి నర్సయ్య రోడ్డు దాటే క్రమంలో హనుమకొండ వైపు వెళ్తున్న లారీ ఢీ కొట్టగా చేతి మీద నుంచి టైర్లు వెళ్లాయి. చేయి నుజ్జునుజ్జు కావడంతో తీవ్ర రక్తస్రావం జరిగింది. పక్కనే ఉన్న భార్య బోరున విలపిస్తూ సాయం చేయండి అంటూ వేడుకున్నారు. స్థానికులు 108కు కాల్ చేయగా, అరగంటకు పైగా స్పందించలేదు. విషయం తెలుసుకుంటే జిల్లాలో ఉన్న అన్ని 108 అంబులెన్స్‌లు జిల్లా ఆస్పత్రి, స్టేషన్ ఘన్‌పూర్ సీహెచ్‌సీ నుంచి రెఫర్ కేసులను వరంగల్ ఎంజీఎంకు తీసుకు వెళ్లారు. దీంతో తీవ్ర గాయాలతో వ్యక్తి రోడ్డుపైనే అవస్థలు పడుతూ అంబులెన్స్ కోసం ఎదురు చూశారు. జిల్లా ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స చేసి హైదరాబాద్‌కు రెఫర్ చేశారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మాక్ జెడ్పీ సమావేశంలో విద్యార్థులు

కొడకండ్ల: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని, పర్యావరణాన్ని దెబ్బతీసే ప్లాస్టిక్ వాడకాన్ని నివారించేందుకు అధికార యంత్రాంగం పటిష్ట చర్యలు తీసుకోవాలని చర్చా వేదికలో కస్తూర్బా బాలికలు కోరారు. ప్లాస్టిక్ వాడకం వలన కలిగే అనర్థాలు, పర్యావరణ పరిరక్షణ, మేడారం జాతరలో భక్తులు ఎదుర్కొనే ఇబ్బందులు వాటి నివారణపై కస్తూర్బా పాఠశాలలో సోమవారం మాక్ జెడ్పీ సమావేశం నిర్వహించి చర్చించారు. జెడ్పీ చైర్మన్, వైస్ చైర్మన్, జెడ్పీటీసీ, ఎంపీపీలు, వివిధ శాఖల అధికారులుగా బాలికలు వ్యవహరించి సమావేశంలో పర్యావరణం, ప్లాస్టిక్ వాడకం, మేడారం జాతరలో కాలుష్యం వంటి అంశాలపై చర్చించారు. ప్లాస్టిక్ వాడకం నిషేధం కాక వినియోగం పెరిగిపోవడంతో పర్యావరణం దెబ్బతింటున్నందున నివారణ చర్యలు తీసుకోవాలని, పచ్చదనం, పరిశుభ్రతలను అందరు పాటించాలని, కాలుష్యం పెరిగిపోయి ఆరోగ్యాలు కూడా దెబ్బతింటున్నాయన్నారు. రెండేళ్లకోసారి నిర్వహించే మేడారం జాతరకు వివిధ రాష్ట్రాల నుంచి కోటి మందికిపైగా భక్తులు హాజరయ్యే అవకాశం ఉన్నందున ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకొని పటిష్ట ఏర్పాట్లు చేయాలని సభ్యులు కోరారు. పాఠశాల విద్యార్థులు ప్రజాప్రతినిధులు, అధికారులుగా వ్యవహరించి విషయ పరిజ్ఞానంతో వ్యవహరించిన తీరు ఆకట్టుకొంది. ఈ సందర్భంగా బాలికలను ఎస్ఓ పేరం శారద అభినందించి, ఇలాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో ప్రజా సమస్యలపై అవగాహన లభించి చదువుతో పాటు సామాజిక అంశాలపై అవగాహన పెరుగుతుందన్నారు.

కేంద్రం నిధులతోనే గ్రామాల అభివృద్ధి



చలోబస్తీ కార్యక్రమంలో నాయకులు



కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

జనగామ: కేంద్ర ప్రభుత్వం అందించిన నిధులతోనే గ్రామాలు అభివృద్ధి చెందాయని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సౌడ రమేష్ అన్నారు. బీజేపీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు పట్టణంలోని 18వ వార్డులో గావ్ చలో అభియాన్ బస్తీ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ గిరిజన మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవరాయ ఎల్ల య్య, జిల్లా ప్రచార కార్యదర్శి పెద్ద జగదీష్, ఉదయ్, చందర్, కూకట్ల ఉప్పల య్య, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

అసాధారణ అభివృద్ధి బీజేపీతోనే సాధ్యం

నర్మెట: పేదల సంక్షేమం, మహిళా సాధికారత, అంతర్గత, బాహ్య భద్రత, సాంస్కృతిక పునరుద్ధరణ, విదేశాల్లో దేశ గౌరవాన్ని పెంచడం వంటి పలు రంగాల అసాధరణ అభివృద్ధి ప్రధాని మోదీ ఆధ్వర్యంలోని బీజేపీతోనే సాధ్యపడిందని గావ్ చలో అభియాన్ మండల కోఆర్డినేటర్ బిచ్చాల కొండల్ రెడ్డి అన్నారు. మండలంలోని మాన్సింగ్‌తండాలో బీజేపీ అభివృద్ధి పథకాలను ఇంటింటికి వివరిస్తూ కరపత్రాలను పార్టీ శ్రేణులతో కలసి సోమవారం పంపిణీ చేసి ఆయన మాట్లాడారు. నగేష్, గణేష్, సాయి, మహేష్, రవి, రమేష్, శ్రీను, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

పాలకవర్గ సేవలు అభినందనీయం



తరిగొప్పుల: అంకుషాపూర్‌లో మాజీ సర్పంచ్, వార్డు సభ్యులను సన్మానిస్తున్న గ్రామస్తులు



చిల్పూరు: రాజవరంలో..

తరిగొప్పుల: పంచాయతీ పాలకవర్గ సేవలు అభినందనీయని ఎంపీడీఓ దేవేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని అంకుషాపూర్ పంచాయతీ కార్యాలయంలో పాలక మండలికి పంచాయతీ కార్యదర్శి కొంకటి రవీందర్ ఆధ్వర్యంలో పదవీ విరమణ వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ దేవేందర్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ నాగపూరి కిషన్‌గౌడ్, గ్రామస్తులు మాజీ సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులను శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. గ్రామస్తుల సహకారంతోనే గ్రామాభివృద్ధి సాధ్యమవుతుందని తాజా మాజీ సర్పంచ్ ముక్కెర బుచ్చిరాజ్ యాదవ్ అన్నారు. పోగుల చంద్రమౌళి,మదాసు బిక్షపతి,మహ్మద్ యాకుబ్, కత్తుల సాయిరెడ్డి, సాంబారి కృష్ణమూర్తి పాల్గొన్నారు.

సన్మానం

చిల్పూరు: రాజవరంలో పంచాయతీ కార్యదర్శి హైమావతి ఆధ్వర్యంలో పదవీకాలం ముగిసిన సర్పంచ్, వార్డు సభ్యులను సోమవారం గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ మారేపల్లి తిరుమలకృష్ణమోహన్ రెడ్డి మాట్లాడారు. ఎంపీటీసీ మారేపల్లి లలితశ్యాం కుమార్‌రెడ్డి, కారోబార్ గూడూరు భాస్కర్ నాయకులు రంగు రవి, వెంకటస్వామి, ఎడ్ల మహిపాల్, యాదగిరి, ఏఎస్ఎం సంతోష, బత్తుల సూర్యనారాయణ, మచ్చ రమేష్, ఉపాధి శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



జనగామ: పట్టణంలోని 21వ వార్డు కౌన్సిలర్ కర్రె శ్రీనివాస్ తండ్రి కర్రె కొమురయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా, విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి సోమవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కొమురయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

నవాబుపేటలో..

లింగాలఘణపురం: మండలంలోని వనపర్తికి చెందిన నక్క యాదయ్య, నవాబుపేటలో మైదం చిన్న ఐలయ్య, లింగాలఘణపురంలో ఏదునూరి ఉదిత్‌లు ఇటీవల మృతి చెందారు. కాగా, బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే కడియం శ్రీహరి సోమవారం పరామర్శించారు. ఎమ్మెల్యేతో పాటు ఎంపీపీ జయశ్రీ, జెడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు జయ, శ్రీధర్, ఎంపీటీసీ రాజిరెడ్డి, నాయకులు నాగేందర్, కుమారస్వామి, మల్లేశం, శ్రీశైలం, వీరయ్య తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ 9వ వార్డు కమిటీల ఎన్నిక



ఎన్నికైన 9వ వార్డు కాంగ్రెస్, అనుబంధ కమిటీలు

జనగామ: కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఆదేశాల మేరకు పట్టణంలోని 9వ వార్డు కమిటీలను సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పార్టీ 9వ వార్డు అధ్యక్షుడిగా పంగ లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షులుగా హన్మకొండ రమేష్, బండారు శ్రీరాములు, ప్రధాన కార్యదర్శులుగా మహమ్మద్ జాంగిర్, తుడి ఆనంద్, యూత్ అధ్యక్షుడిగా మహమ్మద్ గౌస్, ప్రధాన కార్యదర్శిగా యం.నర్సింగరావు, మహిళ అధ్యక్షురాలిగా ఫర్జిన్ సుల్తానా, ప్రధాన కార్యదర్శిగా నీలం శ్రీలత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఎన్నికల పరిశీలకులు చెంచారపు శ్రీనివాస్ రెడ్డి, కౌన్సిలర్ ముస్త్యాల చందర్, సమన్వయ కమిటీ సభ్యులు మేడ శ్రీనివాస్, బుచ్చిరెడ్డి, వంగాల మల్లారెడ్డి, ఆలేటి సిద్ధిరాములు, జక్కుల అనిత వేణుమాధవ్, మునిసిపల్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గాదెపాక రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎస్సీసెల్ అధ్యక్షుడిగా వెంకటస్వామి

రఘునాథపల్లి: మండలంలోని అశ్వరావుపల్లిలో సోమవారం కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు తురుగొండ స్వామి, ఎస్సీసెల్ మండల ఇన్‌చార్జ్ జీడికంటి రాజ్‌కుమార్‌ల సమక్షంలో పార్టీ కార్యకర్తలు ఎస్సీసెల్ నూతన అధ్యక్షుడిగా పొన్నగంటి వెంకటస్వామిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా అనిల్, ప్రధాన కార్యదర్శిగా రవీందర్, కోశాధికారిగా రామచంద్రం, సలహా సంఘ సభ్యులుగా చాగంటి స్వామి, కొయ్యడ వెంకటయ్య, రాజశేఖర్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు మేడిపల్లి వెంకటేశ్వర్లు, నిమ్మ కృష్ణారెడ్డి, కర్నె అశోక్, తూముకుంట్ల మల్లారెడ్డి, జాలూరి వేణు, కుమారస్వామి, రాజు పాల్గొన్నారు.

స్వచ్ఛంద సేవతో సమాజానికి మేలు



అవార్డు అందుకుంటున్న వెలంగిని



అవార్డుతో రత్నాకర్‌రెడ్డి

నర్మెట: స్వచ్ఛంద సేవతో యువత గుర్తింపు పొందడమే కాకుండా సమాజానికి మేలు చేకూరుతుందని యువచైతన్య వెల్ఫేర్ సొసైటీ వరంగల్ చైర్మన్ పోలోజు రాజ్‌కుమార్ అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో సామాజిక సేవతో గుర్తింపు పొందిన పలువురికి ఆదివారం వరంగల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సేవారత్న ప్రదానం చేశారు. ముఖ్య అతిథులుగా హాజరైన వరంగల్, వర్ధన్నపేట ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, హనుమకొండ జెడ్పీ చైర్మన్ మరెపల్లి సుధీర్‌కుమార్ హాజరై యువత చదువుతోపాటు సమాజ సేవలో ముందుండాలని అన్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రానికి చెందిన ఎనుగుల వెలంగిని గత 14 ఏళ్లుగా సేవలందిస్తుండగా సొసైటీ సేవారత్న బిరుదుతో సత్కరించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

రత్నాకర్‌రెడ్డికి అవార్డు

చిల్పూరు: మండలంలోని పల్లగుట్ట గ్రామానికి చెందిన ఎనపగందుల రత్నాకర్‌రెడ్డి గ్రామీణ సేవా రంగంలో సేవారత్న అవార్డును అందుకున్నారు. యువ చైతన్య వెల్ఫేర్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ ఆయనకు అవార్డును అందజేసింది.

'వనదేవతల దీవెనలతో అధికారంలోకి కాంగ్రెస్'



స్టేషన్‌ఘన్‌పూర్: వన దేవతలైన మేడారం సమ్మక్క–సారలమ్మ దేవతల ఆశీర్వాదంతోనే రాష్ట్రంలోనే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని ఆ పార్టీ జిల్లా నాయకుడు, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొలిపాక సతీష్ అన్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే, రేవంత్‌రెడ్డి సీఎం అయితే వన దేవతలకు ఎత్తు బంగారం(బెల్లం) చెల్లిస్తానని మొక్కుకున్న సతీష్ తమ మొక్కు చెల్లించేందుకు సోమవారం ఘన్‌పూర్‌లో ఓ కిరాణాషాపు వద్ద తన ఎత్తు బంగారం తూకం వేయించి కొనుగోలు చేశారు. మేకల మల్లేశం, ఉపేందర్, శ్రీనివాస్, ఈశ్వర్‌ప్రసాద్, శ్రీనివాస్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

గ్రంథాలయం ఆకస్మిక తనిఖీ

లింగాలఘణపురం: గ్రంథాలయాల్లో పాఠకుల విజ్ఞప్తి మేరకు పుస్తకాలను అందజేస్తామని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం.సుధీర్‌కుమార్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ పోటీ పరీక్షలకోసం పుస్తకాలను నిరుద్యోగ యువత విజ్ఞప్తి మేరకు అందజేయడం జరుగుతుందని, గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అదేవిధంగా మౌలిక వసతుల ను కల్పిస్తామని, మండల కేంద్రంలోని గ్రంథాలయానికి నీటి వసతి కల్పించి మూత్రశాలలు, మరుగుదొడ్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ సందర్భంగా రికార్డులను తనిఖీ చేశారు.

రేపు సమస్యల పరిష్కార వేదిక

స్టేషన్‌ఘన్‌పూర్: శివునిపల్లి, జఫర్‌గఢ్ విద్యుత్ సెక్షన్‌ల పరిధి విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికను శివునిపల్లి రైతు వేదికలో ఈనెల 7న నిర్వహిస్తున్నట్లు ఎన్పీడీసీఎల్ స్టేషన్‌ఘన్‌పూర్ ఇన్‌చార్జ్ ఏడీఈ వంశీకృష్ణ, శివునిపల్లి ఏఈ శివకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ మీటర్లు, విద్యుత్ బిల్లులు, కరెంటు సరఫరా తదితర సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువస్తే తక్షణమే పరిష్కరిస్తారని పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు సమావేశం ఉంటుందని తెలిపారు.

అభినందనలు



పాలకుర్తి: రాష్ట్ర స్థాయి అండర్ –14 రగ్బీ చాంపియన్ షిప్ పోటీలు ఈ నెల 3,4 తేదీల్లో యాదాద్రిలో జరిగాయి. కాగా, జిల్లా జట్టు ప్రథమ స్థానంలో నిలిచిందని రగ్బీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు దొంతరమల్ల గణేష్ తెలిపారు. సోమవారం ఆయన జట్టు క్రీడాకారులను అభినందించారు. అరుణ్, శ్రీకాంత్, అశోక్ తదితరులు ఉన్నారు.

హామీల అమలు కాంగ్రెస్‌కే సాధ్యం



పాలాభిషేకం చేస్తున్న నాయకులు

దేవరుప్పుల: ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయడం కాంగ్రెస్ పార్టీకే సాధ్యమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు పెద్ది కృష్ణమూర్తి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని జనగామ–సూర్యాపేట రహదారి చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి ఫ్లెక్సీకి నాయకులు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొలుత మహిళలకు ఆర్టీసీ ప్రయాణ ఉచితం, రూ.10 లక్షల ఆరోగ్యశ్రీ భీమా, ప్రస్తుతం రూ.500లకే గ్యాస్, 200 యూనిట్ల కరెంటు ఉచిత పథకాలకు కేబినేట్ తీర్మానం చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. ఎస్టీ సెల్ అధ్యక్షుడు భూక్యా సజ్జన్ నాయక్, సీనియర్ నాయకులు మాసంపెల్లి మహేందర్‌జీ, రెడ్డి రాజుల రమేష్, పారుపెల్లి శ్రీనివాస్, ఆకుల సోమనర్సయ్య, రతన్‌జీ, మండల యూత్ అధ్యక్షుడు అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మెను విజయవంతం చేయాలి

జఫర్‌గఢ్: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు, కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 16న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాపర్తి సోమయ్య పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. సమావేశంలో రాజు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

బెల్టు షాపు నిర్వాహకులపై కేసు

దేవరుప్పుల: మండలంలోని బంజరలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కొంగరి శ్రవణ్‌కుమార్ తెలిపారు. సోమవారం రాత్రి బంజరలో లక్ష్మయ్య,నర్సింహ అనే ఇద్దరి ఇంట్లో తనిఖీ చేయగా రూ. 11,150 విలువైన మద్యం స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

తరిగొప్పుల: నిబంధనలకు విరుద్ధంగా బెల్టు షాపు నిర్వహిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై దూదిమెట్ల నరేష్ తెలిపారు. మండలంలోని సోలిపూరం గ్రామానికి చెందిన ఎదునూరి సిద్దయ్య బెల్టు షాపు నిర్వహిస్తున్నాడనే సమాచారంతో ఇంటిలో తనిఖీ చేయగా బీరు, మద్యం బాటిళ్లు పట్టుబడ్డాయని పేర్కొన్నారు. సుమారు రూ.5,000 విలువైన 13 కేఎఫ్ స్ట్రాంగ్, 13 కేఎఫ్ లైట్ బీర్లు, 3 క్వాటర్ బాటిళ్ల మద్యం స్వాధీనం చేసుకొని నిర్వాహకుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

బాధిత కుటుంబానికి సాయం

దేవరుప్పుల: మండల కేంద్రంలోని కొత్తకాలనీకి చెందిన తోటకూరి ఉపేందర్ మృతి చెందాడు. కాగా, పలువురు బాధిత కుటుంబానికి సాయం అందించి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. చిలుకూరి ఉమేష్ ఆర్థిక సాయం అందించగా శ్రీ కృష్ణయాదవ యూత్ సభ్యులు రెండు క్వింటాళ్ల బియ్యం అందించారు. యూత్ అధ్యక్షుడు తోటకూరి సంతోష్, ఉపాధ్యక్షుడు లోడంగి అశోక్, కార్యదర్శి తోటకూరి రాజశేఖర్,కోశాధికారి కాసాని వినయ్, బాల్యమిత్రులు తోటకూరి రమేష్,వెంకన్న, శ్రీకాంత్, మహేష్, సురేష్ తదితరులు ఉన్నారు.

పోలీసుల ఔదార్యం



గాయపడిన మహిళను ఆస్పత్రికి తరలిస్తున్న పోలీసులు

బచ్చన్నపేట: రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ మహిళను చేరదీసి ఆస్పత్రికి తరలించి పోలీసులు ఔదార్యం చాటుకున్నారు. సోమవారం మండలంలోని మన్‌సాన్‌పల్లికి చెందిన గీస యాదలక్ష్మి ద్విచక్రవాహనంపై బచ్చన్నపేటకు వస్తుండగా ఇటుకాలపల్లి, నక్కవానిగూడెం మధ్య కింద పడిపోయింది. ఈ ఘటనలో ఆమె స్వల్ప గాయాలపాలైంది. అదేసమయంలో సాల్వాపూర్ నుంచి బచ్చన్నపేటకు వస్తున్న సీఐ సాయి రమణ, ఎస్సై సతీష్ వెంటనే స్పందించి ఆమెను ఆస్పత్రికి చికిత్స నిమిత్తం పంపించారు. కాగా, గ్రామస్తులు పోలీసుల సేవలను కొనియాడారు.

బియ్యం అందజేత



పాలకుర్తి టౌన్: మండల కేందంలో చిన్నపెల్లి కుమార్ అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా, అమ్మ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ శ్రీకాంత్, కార్యదర్శి జీడి హరీశ్‌లు బాధిత కుటుంబానికి 25 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులను సోమవారం అందజేశారు. ఉపాధ్యాయుడు చిదిరాల శ్రీనివాస్ సహకారం సరుకులు అందజేసినట్లు ట్రస్టు సభ్యులు తెలిపారు.

పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకోండి



నర్మెట: ఓటరు నమోదులో నాయకులు




పాలకుర్తి: సమావేశంలో పాల్గొన్న నాయకులు

నర్మెట: రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాలకు చెందిన పట్టభద్రులు తమ ఓటుహక్కును నమోదు చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి గంగం నర్సింహారెడ్డి కోరారు. మండలంలోని మచ్చుపహాడ్‌లో సోమవారం ఉచిత ఓటు నమోదు కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. నవంబర్ 2020లోగా ఉత్తీర్ణులైన వారు ఫామ్–18 ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని చివరి రోజైన నేడు (మంగళవారం) మండల కేంద్రంలో ఉచిత నమోదు కార్యక్రమం చేపట్టినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ గాదె మోహన్ రెడ్డి, కొమురవెల్లి దేవస్థాన కమిటీ మాజీ చైర్మన్ గొల్లపల్లి కుమార స్వామి, రాష్ట్ర ఓబీసీ సెల్ కార్యదర్శి ఫరీదుల యాదయ్య, జిల్లా కార్యదర్శి భూక్య జయరాం, సీనియర్ నాయకులు బైగోని సురేందర్, మోత్కూరి లక్ష్మయ్య, యూత్ కాంగ్రెస్ టౌన్ అధ్యక్షుడు ప్రెజ్ఞాపురం శ్రీధర్, సోషల్ మీడియా మండల అధ్యక్షుడు బుర్రా రాజుగౌడ్, నరేష్, ప్రశాంత్, శ్రీనివాస్, రవి పాల్గొన్నారు.

పాలకుర్తి: పట్టభ్రధులు ఓటరుగా నమోదుచేసుకోవాలని యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మాదాసు హరీశ్ కోరారు. మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి, కమ్మగాని శ్రావన్ కుమార్, యాకుబ్ రెడ్డి, గద్దం బాబు, మోకాటి వెంకటేష్, జీడి నిరంజన్, దేశబోయిన ప్రశాంత్ పాల్గొన్నారు.

'రాజయ్యకు కాంగ్రెస్‌లో స్థానంలేదు'



మాట్లాడుతున్న దిలీప్‌రెడ్డి

లింగాలఘణపురం/రఘునాథపల్లి/చిల్పూరు: మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్యకు కాంగ్రెస్ పార్టీలో స్థానం లేదని, పార్టీకి మోసం చేసి బీఆర్ఎస్‌లో చేరి తిరిగి కాంగ్రెస్‌లో చేరుతానంటే అధిష్ఠానం తీసుకోవద్దని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దిలీప్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొల్లూరి శివ, మండల ఇన్‌చార్జ్ సదానందం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంపీటీసీ నర్సయ్య, మహిళ విభాగం మండల అధ్యక్షురాలు శ్రీలతారెడ్డి, చిట్ల వెంకటేశ్వర్లు, బీమ రాజు, రాజశేఖర్, నీలం మోహన్ పాల్గొన్నారు. రఘునాథపల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో కాంగ్రెస్ జిల్లా నాయకుడు మేకల నరేందర్, మండల అధ్యక్షుడు కోళ్ల రవిగౌడ్, ఎంపీటీసీ బానోత్ భిక్షపతినాయక్ తదితరులు పాల్గొన్నారు. అలాగే చిల్పూరులో జరిగిన సమావేశంలో రాజయ్యను కాంగ్రెస్ పార్టీలోకి తీసుకోవద్దని ఆ పార్టీ మండల నాయకులు ఏకగ్రీవ తీర్మానం చేసి సీఎం రేవంత్‌రెడ్డికి పంపారు. పార్టీ మండల అధ్యక్షుడు సురేష్, మండల ఇన్‌చార్జ్ తీగల మహేందర్, కోళ రవి, పుట్ట కిరణ్‌రెడ్డి, తొటి సునీల్, యాదవరెడ్డి, జక్కుల రాజయ్య పాల్గొన్నారు.